సభ్యీ కేంద్రం సేవలపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యీ కేంద్రం సిబ్బంది

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 22 : సభ్యీ కేంద్రం ద్వారా కల్పిస్తున్న సేవలను మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సరస్వతి, సోషల్ కౌన్సిలర్ లావణ్య సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 181, 100, 1098, 1930 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతాం

ఎదులాపురం, డిసెంబర్ 22: సభ్యీ కేంద్రానికి వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైటీసీ, పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సభ్యీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు, పోక్సో చట్టం, సైబర్‌క్రైమ్‌పై సమగ్రంగా వివరించారు. సభ్యీ కేంద్రం ఆధ్వర్యంలో న్యాయ, పోలీస్, వైద్య, కౌన్సెలింగ్, తాత్కాలిక వసతి తదితర సేవలు అందిస్తామన్నారు. అత్యవసర సమయంలో 181, 100, 1098, 1930 హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య, కళాశాల ప్రిన్సిపాల్ మారుతీశర్మ, లెక్చరర్స్,టీచర్స్ విద్యార్థులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన

రైల్వే స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఎదులాపురం,డిసెంబర్22: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమైన నాటి నుంచి గిరాకీలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆటోడ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జైనథ్, భీంపూర్, తలమడుగు, తాంసీ మండలాలకు చెందిన ఆటో డ్రైవర్లు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మంచి ఉద్దేశంతో ప్రారంభించినా .. ఆ పథకం ద్వారా తమ ఉపాధికి గండి పడందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తమ సమస్యలపై సత్వరమే స్పందించాలని కోరారు. రాహుల్ గాంధీ తెలంగాణలో పర్యటించిన సమయంలోనూ ఆటో డ్రైవర్‌లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఏజెన్సీ దళితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న దళిత జేఏసీ నాయకులు

నార్నూర్, డిసెంబర్22: రాష్ట్రంలోని ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలంటూ దళిత జేఏసీ తెలంగాణ సంఘం నాయకుడు దళిత అవార్డు గ్రహీత నర్సింగ్‌మోరే, రాష్ట్ర నాయకుడు మహేందర్ దుర్గే శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. అలాగే ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశామని వారు తెలిపారు. ఇక్కడ నాయకులు కాంబ్లే భగ్‌వాన్,రాష్ట్రపాల్ తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

బోథ్, డిసెంబర్ 22 : మహిళా సాధికారత ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని జెండా స్పెషలిస్ట్ కోటేశ్వర్ సూచించారు. గురువారం మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రేమల అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వర్ మాట్లాడుతూ ప్రతి మహిళ తన కాళ్లపై తాను నిలబడి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధించిన వారవుతారన్నారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావోపై ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో మండల సమాఖ్య కార్యదర్శి సేవంతాబాయి, సీసీలు సంజీవ, లక్ష్మయ్య, గంగాధర్, విజయలక్ష్మి, మౌనిక, పోసాని, సుభద్ర, గంగాధర్, మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు, కార్యాలయ సిబ్బంది అశోక్, జ్యోతి వర్మ, సర్వేశ్వర వర్మ, పోశెట్టి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

తాంసి, డిసెంబర్ 22 : కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పంచాయతీ రాజ్ కేంద్ర మంత్రిత్వ శాఖ డైరెక్టర్ రమిత్ మౌర్య సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలో పంచాయతీ రాజ్ కేంద్ర మంత్రిత్వ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విక్సిత్ భారత్ సంకల్ప యాత్ర ఏర్పాటు చేశారు. ఇందులో 17 శాఖలకు సంబంధించిన అధికారులు, మహిళలు హాజరై కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి 2024 నూతన క్యాలెండర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్నప్రకాశ్, డీఆర్డీవో కిషన్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఏపీడీ నరేందర్, వీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీధర్, డీఎస్‌వో కిరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రిమ్స్ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ కార్యవర్గం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 22 : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ (జూడా) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ సందీప్ చారి, ఉపాధ్యక్షులుగా రాజు యాదవ్, కార్తీక్, మౌనిక, సూరజ్, ప్రధాన కార్యదర్శులుగా కారుణ్య కళంగి, అన్వేష్, కోశాధికారులుగా బాలమురుగన్, ప్రత్యూష సిన్హా, అడ్వైజర్, స్పోక్ పర్సన్‌గా అరుణ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవంలో పూజలు

నేరడిగొండ, డిసెంబర్ 22 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుద్దికొండ శబరిమాత ఆశ్రమ 22వ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ్రమాల్లో మౌలిక వసతులను కల్పిస్తానని చెప్పారు. అనంతరం శివానంద భారతీ స్వామి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నేరడిగొండ, బోథ్ ఎంపీపీ లు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, తాంసి జడ్పీటీసీ రాజు, సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ పెంట వెంకటరమణ, ఎంపీటీసీ పండరి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సర్పంచ్ విశాల్‌కుమార్, అశోక్, నాయకులు మదన్ సింగ్, సురేందర్, నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను శుక్రవారం నేరడిగొండలోని ఆయన నివాసంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సన్మానించారు.

ఇచ్చోడ: క్రిస్మస్ కిట్లు అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

క్రిస్మస్ కానుకల పంపిణీ

ఇచ్చోడ, డిసెంబర్ 22 : మండలకేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన క్రిస్మస్ సెలబ్రేషన్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గాడ్గె సుభాష్, శివకుమార్, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ఇచ్చోడ: కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తాంసి(తలమడుగు), డిసెంబర్ 22 : తాంసి, తలమడుగు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో నారాయణ మాట్లాడుతూ 13 ఏళ్ల వయసులో త్రికోణమితి సిద్ధాంతాలను రాసి, ప్రపంచ అగ్రగామి మేధావుల్లో రామానుజన్ ఒకరిగా ఉండడం దేశం గర్వించదగ్గ విషయమన్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు సుకుమార్ పెట్కులే, సత్యనారాయణ, సురేఖ, సురేందర్, సురేఖ పాల్గొన్నారు.

ఇచ్చోడ, సిరికొండలో..

ఇచ్చోడ, డిసెంబర్ 22 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ కరస్పాండెంట్ సురకంటి వనమాల, ప్రిన్సిపాల్ ఏనుగు ప్రశాంత్ రెడ్డి, హిమధర్, రాజేశ్, వెంకట్‌రావ్, ఏక్‌నాథ్, కంప్యూటర్ సంతోష్, పీఈటీ రాజు, భుమేశ్, ఆదిత్య, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్‌లో

బోథ్, డిసెంబర్ 22 : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కన్గుట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బోథ్‌లోని వేదం, నాగ భూషణం, శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులు చార్ట్‌లతో ప్రదర్శనలు నిర్వహించారు. కన్గుట్టలో 1729 ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. వేదం పాఠశాలలో ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎస్సై రాము ప్రయోగాలను తిలకించి విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సంతోష్, కిశోర్ కుమార్, చిల్క సతీశ్, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

భీంపూర్‌లో..

భీంపూర్, డిసెంబర్ 22: భీంపూర్, కరంజి(టీ), అంతర్గాం, పిప్పల్‌కోటి పాఠశాలల్లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ఎంలు శిల్ప, భూమన్న, ఏలియా, శ్రీకాంత్, శ్యాంసుందర్, ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నేరడిగొండలో

నేరడిగొండ, డిసెంబర్ 22 : ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికల లఖంపూర్‌లో గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నట్లు ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులను సన్మానించారు.

భీంపూర్: రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అటవీశాఖ కార్యాలయం వద్ద విద్యార్థుల ధర్నా

- పనులను ఆపితే ఆందోళన ఉధృతం చేస్తాం
- అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదు

నేరడిగొండ అటవీశాఖ కార్యాయలం వద్ద బైఠాయించిన కళాశాల విద్యార్థులు

నేరడిగొండ, డిసెంబర్ 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం అటవీశాఖ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. కళాశాల ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను అటవీశాఖాధికారులు నిలిపి వేయడంతో ఆందోళన చేపడుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2002లో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం 2.18 ఎకరాల భూమిని కేటాప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. కళాశాల ఆవరణ అటవీశాఖ పరిధిలో ఉందంటూ అభివృద్ధి పనులను అటవీశాఖాధికారులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలల కోసం ప్రభుత్వం రూ. పది లక్షలు మంజూరు చేయగా ఎమ్మెల్యే జాదవ్ అనిల్ భూమిపూజ చేశారు. ఈ మేరకు పనులు ప్రారంభించగా అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పనులను అడ్డుకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. అనంతరం అటవీశాఖాధికారులకు విద్యార్థులు, అధ్యాపకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ షబానాతరన్నం, అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, డిసెంబర్ 22 : క్రిస్మస్ సెలవుల సందర్భంగా బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ కేంద్రాల్లో సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్లను మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి దేవన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోథ్, పొచ్చెర, నేరడిగొండ, సోనాల కేంద్రాల్లో కొనుగోలు ఉండవని తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 22: మావల మండల కేంద్రంలోని జాతీయ రాహదారిపై ఇటీవల దళిత యువకుడు వంశీపై హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దళిత ఐక్య సంఘాల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుమ్రంభీం చౌరస్తాలో దళిత ఐక్య సంఘాల వేదిక ఆధ్వర్యంలో రాస్తారొకో చేపట్టారు. దళిత యువకుడు వంశీపై హత్యాయత్నం చేసిన, చేయించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఇక్కడ దళిత ఐక్య సంఘాల వేదిక జిల్లా కన్వీనర్ అల్లూరి భూమన్న , నాయకులు నిమ్మల ప్రశాంత్, శశికాంత్, తుల్జాపూరే శోభ, రత్నజాడే ప్రజ్ఞకుమార్, గడుగు గంగన్న, సందీప్, అశోక్, అడెల్లు, మేదరి స్వామి, మాజీ జడ్పీటీసీ బాబన్న, నవీన్ కుమార్, దయాకర్ ఉన్నారు.

హనుమాన్ భక్తుల గ్రామ సంకీర్తన

బోథ్, డిసెంబర్ 22 : కౌర(బీ)లో శుక్రవారం హనుమాన్ భక్తులు గ్రామ సంకీర్తన చేపట్టారు. దీక్షాకాలం పూర్తి కావడంతో సన్నిధానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ చిత్రపటాలతో భక్తి గీతాలు ఆలపిస్తూ ఇంటింటికీ తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో 15 మంది హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీటీరోడ్డు నిర్మాణ పనులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 22: మండలంలోని కెస్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కెస్లాగూడ(ఎం)గ్రామంలో బీటీరోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కొన్నేండ్ల తర్వాత గ్రామానికి బీటీరోడ్డు మంజూరు కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామం నుంచి మండలకేంద్రానికి తొందరగా వెళ్లిరావచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 22 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో రాష్ట్రంలో 8 మంది డిబార్ అయినట్లు కేయూ అధికారులు తెలిపారు. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు ఉన్నట్లు పేర్కొన్నారు. నిర్మల్‌లోని సాయి వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, నేరడిగొండలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఎవరూ మాస్ కాపీయింగ్ పాల్పడపద్దని సూచించారు.

అంగన్‌వాడీలో క్రిస్మస్ వేడుకలు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 22: పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ అనుముల్వార్ కవిత ఆధ్వర్యంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు నెమడోలే, అస్మా, స్వాతి, అమీనా, ఇర్ఫానా పాల్గొన్నారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 22 : పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం డైట్ కళాశాలలో పదో తరగతి విద్యార్థుల పరీక్షలు, ఇతర అంశాలపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని, విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. గడువులోగా సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తి చేసి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పదో తరగతి పూర్తయిన ప్రతి విద్యార్థి కళాశాలల్లో ప్రవేశాలు పొందేలా సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రీడ్ టు రూమ్ కార్యక్రమం ద్వారా ప్రాథమిక స్థాయి విద్యార్థులకు చదవడం, రాయడం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, మండల విద్యాధికారి జయశీల, సెక్టోరల్ అధికారి నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బాబేఝరిలో వైద్యశిబిరాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- బాబేఝరిలో వైద్య శిబిరం సందర్శన

నార్నూర్, డిసెంబర్ 22: వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాబేఝరిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ అనంతరం ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని గిరిజన ప్రజలకు సూచించారు. ఇక్కడ సర్పంచ్ మడావి కైలేశ్వరీసాగర్, అడిషనల్ డీఎంహెచ్‌వో కుమ్ర బాలు, వైద్యాధికారులు సంజీవ్, మేఘన, రవూఫ్, రాజమణి, కోఆర్డినేటర్ మాణిక్‌రావు, సీహెచ్‌వో లక్ష్మి, తుల సీదాస్, శీర్షి, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, సిబ్బంది హిమబిందు, ఈశ్వర్, గోకుల్, బాపురావ్, రవీందర్, కేశవ్, ఈశ్వరి, మొబిలైజర్ మడావి విమల, అంగన్‌వాడీ టీచర్ నీలాబాయి, ఆశ కార్యకర్తలు కల్పన, రమాదేవి, గంగుబాయి, ఎత్మాబాయి, రూపాబాయి ఉన్నారు.

డాక్టర్ రవీంద్ర నాయక్‌ను కలిసిన రిమ్స్ డైరెక్టర్

డాక్టర్ రవీంద్రనాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్,వైద్యులు,నాయకులు

ఎదులాపురం,డిసెంబర్22: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రజారోగ్య వైద్య సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్, డీఎంఈ డైరెక్టర్ డాక్టర్ త్రివేణిని శుక్రవారం హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ డాక్టర్ చంద్రశేఖర్, వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్-1 జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, సీనియర్ నాయకులు జీఎం అక్బర్, మంచాల రవీందర్ ఉన్నారు.

ఆదిలాబాద్‌లో సలార్ సందడి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 22 : జిల్లా కేంద్రంలో హీరో ప్రభాస్ అభిమానుల సందడి నెలకొంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన సలార్ శుక్రవారం విడుదల కావడంతో పట్టణంలోని సినిమా థియేటర్ల వద్ద అభిమానులు సంబురాలు జరుపుకొన్నారు. ప్రభాస్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, డీజే పాటలకు డ్యాన్స్ చేస్తూ హోరెత్తించారు. భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

ఎదులాపురం,డిసెంబర్22: రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన సలార్ సినిమా శుక్రవారం రిలీజ్ కావడంతో ఆయన అభిమానులు సందడి చేశారు. ఆదిలాబాద్‌లోని నటరాజ్ థియేటర్ వద్ద తమ అభిమాన హీరో కట్‌అవుట్లను ఏర్పాటు చేసి, డ్యాన్సులు చేస్తూ హోరెత్తించారు.

ఎంపీల సస్పెన్షన్‌పై నిరసన

భీంపూర్, డిసెంబర్22: లోక్‌సభలో 114 మంది సభ్యులను సస్పెండ్ చేయడంపై శుక్రవారం భీంపూర్ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మతీన్‌పటేల్, అశోక్‌రెడ్డి , గంగారెడ్డి, అశోక్, నారాయణరావు, రమేశ్ ఉన్నారు.

ఎదులాపురం,డిసెంబర్22: లోక్ సభ ఎంపీల సస్పెన్షన్‌ను ఖండిస్తున్నామని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో కాంగ్రెస్ నాయకులు సేవ్ ఇండియా అంటూ కేంద్రానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలు చేశారు. కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకుడు సంతోష్, డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నగేశ్ ఉన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

మాట్లాడుతున్న ఎంపీపీ కనక మోతుబాయి

- ఎంపీపీ కనక మోతుబాయి
- మండల సర్వసభ్య సమావేశం

నార్నూర్, డిసెంబర్ 22: ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కనక మోతుబాయి కోరారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో చేపట్టిన ప్రగతిని ఆయా శాఖల అధికారు లు సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, ప్రగతి పనులు కొనసాగించాలన్నారు. ప్రజాప్రతినిధులు పలు సమస్యలు సభా దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీవో కావల రమేశ్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, వ్యవసాయాధికారి గిత్తే రమేశ్, ఎంఈవో రాపెల్లి ఆశన్న, ఏఈలు రాథోడ్ సునీల్, సుభానీ, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 22: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉ